

పరదేశీ కథలు

- చిట్టి సిద్ధ లలిత



- 143 -

అతికిన బతుకు

కుమిలి కుమిలి ఏడుస్తోంది రుక్మిణి. భర్త చనిపోయిన బాధ కన్నా మూర్ఖత్వం నిండిన జనాల మాటలు ఆమె హృదయాన్ని బాధిస్తున్నాయి. ఆమె ఎదురొస్తే ముండమోపి ముఖం చూసాం ఏం జరుగుతుందో అని మొహం తిప్పుకుని పోయేవాళ్ళు, సూటిపోటి మాటలతో నొప్పించేవాళ్ళు ఎక్కువయ్యారు.

రుక్మిణి దురదృష్టవంతురాలని అందుకే అతడు అర్ధాంతరంగా చనిపోయాడని తిట్టేవాళ్ళు మరికొందరు...ఈ పరిస్థితి నుండి ఎలా తప్పించుకోవాలో, ఏ విధంగా తన నుదిటి రాతను మార్చుకోవాలో అర్థం కావడం లేదు రుక్మిణికి.

పచ్చని పొలాలు, కాలువ నీటి సడులతో కళకళలాడే ఆ ఊళ్లో... రుక్మిణి బతుకు మాత్రం ఒక అమావాస్య రాత్రిలా మిగిలిపోయింది. పెళ్లై రెండేళ్లు నిండకుండానే, విధి ఆడిన నాటకంలో ఆమె భర్త రోడ్డు ప్రమాదంలో కన్నుమూశాడు. పూల జడతో, పసుపు కుంకుమలతో కళకళలాడాల్సిన ఆ ఇరవై ఏళ్ల పసిప్రాయం... ఒక్కసారిగా తెల్లచీర లోకి కుదించుకుపోయింది.

ఊళ్లో ఏ శుభకార్యమైనా, పండగైనా రుక్మిణిని పిలవడం మానేశారు. పసుపు రాసుకోవడం పాపం, బొట్టు పెట్టుకోవడం అరిష్టమనే మూర్ఖపు నమ్మకాలు ఆమెను ఒక అంటరానిదానిలా చూసేలా చేశాయి. ఇరుగుపొరుగు ఇళ్లలో పెళ్లిళ్లు, పేరంటాలు జరుగుతుంటే... రుక్మిణి తన ఇంటి మూలన కూర్చుని కన్నీరు మున్నీరయ్యేది.

ఒకరోజు ఆ ఊరి ప్రెసిడెంట్ భార్య సుబ్బమ్మ, "అయ్యో విధవ ఎదురుపడింది... దీని మొహం చూడటం ఎంత దరిద్రం" అంటూ రుక్మిణిని అవమానించి పక్కకు నెట్టింది. మనసు ముక్కలైన రుక్మిణి బాగా ఆలోచించి ఈ ఊరికి, మనుషులకు దూరంగా పోవాలని నిర్ణయించుకుంది.

ఎలాగైనా విదేశాలకు వెళ్లి బతకాలని సంకల్పించింది. అప్పులు చేసి ఎట్టకేలకు ఒకరోజు కువైట్ విమానం ఎక్కింది.

కువైట్ గడ్డపై అడుగుపెట్టిన మొదట్లో అరబిక్ భాష రాక తికమకపడి యజమానుల తిట్లతో రుక్మిణి నానాపాట్లు పడింది. అయినా ఆమె కుంగిపోలేదు. తనకున్న టైలరింగ్ (కుట్టుపని) విద్యపై దృఢమైన నమ్మకం ఉంచింది. పగటిపూట ఇళ్లలో పనులు చేస్తూనే, రాత్రంతా డిజైన్లు నేర్చుకుంది. ఆధునిక ఫ్యాషన్ ట్రెండ్స్, పట్టు వస్త్రాలపై ఎంబ్రాయిడరీ పనుల్లో అద్భుతమైన నైపుణ్యం సాధించింది.

అంతటితో ఆమె తృప్తి చెందలేదు. ఏదో సాధించాలి అనే తపన ఆమెను నిలవనీయలేదు. తన తప్పేమీ లేకపోయినా విధవ అనే ముద్ర వేసి కించపరిచిన సమాజంపైన కోపం పోలేదు. ఎవరైతే అవమానించారో వారే తిరిగి గౌరవించే స్థితికి ఎదగాలి అని భావించింది రుక్మిణి. అందుకు డబ్బు సంపాదించడమే ధ్యేయంగా శ్రమించింది.

ఒకరోజు కువైట్ గ్రౌండ్స్ లో సంప్రదాయ దుస్తుల ఎగ్జిబిషన్ జరుగుతోందని తెలిసి షేకులు వేసుకునే దుస్తులను డిజైన్ చేసి కుట్టి ప్రదర్శించింది. అందరి దృష్టీ ఆ దుస్తులపై పడింది.

ఆ ఎగ్జిబిషన్ కు వచ్చిన రాజ కుటుంబం ఒక భారతీయ టైలర్ ప్రావీణ్యం చూసి ఆశ్చర్యపోయి అభినందించారు.

ఆ రోజు ఆమె జీవితాన్ని ఒక గొప్ప మలుపును తిప్పింది. మరుసటి రోజే రాజు ప్యాలెస్ నుండి ఆమెకు కబురు వచ్చింది. తమ కుటుంబానికి దుస్తులు కుట్టమని పురమాయించారు. తన ప్రతిభను ప్రదర్శించింది రుక్మిణి.

ఆమె పనితనం నచ్చి, సాక్షాత్తు కువైట్ రాజభవనంలోని మహిళల దుస్తుల డిజైనింగ్ విభాగానికి సహాయకురాలిగా ఎంపికైంది. రాణిగారు మరియు రాజకుమార్తెలకు ఆమె అందించిన అరుదైన డిజైన్లు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

సంవత్సరాలు గడిచేకొద్దీ రుక్మిణి కేవలం ఒక టైలర్ మాత్రమే కాదు, అక్కడి రాచరిక కుటుంబానికి అత్యంత నమ్మకమైన చీఫ్ ఫ్యాషన్ కన్సల్టెంట్‌గా ఎదిగింది.

ఆమె బ్యాంక్ ఖాతాలో కోట్ల రూపాయల సంపాదన జమ అయ్యింది. కానీ రుక్మిణికి కేవలం సంపాదించడం మాత్రమే కాకుండా... తన్ను అవమానించిన ఊరిలోనే తన ఉనికిని చాటాలనే బలమైన కోరిక కలిగింది.

కువైట్‌లో ఉంటూనే రుక్మిణి తన ప్లాన్‌ను అమలు చేయడం మొదలుపెట్టింది. ఊళ్లో ఎవరికీ అనుమానం రాకుండా, హైదరాబాద్‌కు చెందిన ఒక పెద్ద న్యాయవాది ద్వారా రహస్యంగా పనులు ప్రారంభించింది.

ఒకరోజు హఠాత్తుగా ఊరి చివర ఉన్న వంద ఎకరాల ఫలవంతమైన భూమిని, ఊళ్లో ఎవరూ ఊహించని ధరకు ఒక 'మిస్టరీ బిజినెస్ మెన్' కొనుగోలు చేసినట్లు వార్త వ్యాపించింది. ఊరి పెద్ద సుబ్బమ్మ మొగుడు, గ్రామ సర్పంచ్ అందరూ ఆ భూమిని తక్కువ ధరకు కొందామనుకున్నారు, కానీ ఎవరో కొత్త వ్యక్తి దాన్ని చేజిక్కించుకోవడంతో దిగ్భ్రాంతికి గురయ్యారు.

"ఎవరా ధనవంతుడు? మన ఊళ్లో ఇన్ని ఎకరాలు కొని ఏం చేయబోతున్నాడు?" అని ఊరంతా గుసగుసలు స్టార్ట్ అయ్యాయి.

అది చాలదన్నట్టు, ఊరి మధ్యలో ఉన్న పాత బంగ్లాను కొనుగోలు చేసి, దాన్ని కూల్చేసి ఒక రాయల్ ప్యాలెస్ లాంటి భారీ భవనాన్ని నిర్మించడం మొదలుపెట్టారు.

నెలలు గడిచాయి. కళ్లు చెదిరేలా ఆ భవనం నిర్మాణం పూర్తయింది. ఇటాలియన్ మార్బుల్స్, స్విమ్మింగ్ పూల్, బంగారు పూత మెరుపులతో ఆ బిల్డింగ్ ఒక ఇంద్రభవనంలా మెరిసిపోతోంది. ఊరి జనం రోజూ ఆ భవనం వైపు ఆశ్చర్యంగా చూస్తూ వెళ్లేవారు.

భవనం ప్రారంభోత్సవానికి తేదీ ఖరారైంది. లాయర్ వచ్చి ఊరి పెద్దలందరికీ, సుబ్బమ్మ కుటుంబానికి కూడా బంగారు వర్ణంలో ఉన్న ఖరీదైన ఆహ్వాన పత్రాలు అందించాడు.

సర్పంచ్ లాయర్‌ను నిలదీశాడు: "అయ్యా! ఇంతకీ ఈ భవనం యజమాని ఎవరు? ఏ మంత్రిగారా? లేక విదేశీ కంపెనీ ఓనరా?"

లాయర్ చిన్నగా నవ్వి, "గృహప్రవేశం రోజునే యజమాని స్వయంగా విమానంలో వస్తున్నారు. అప్పుడు మీకే తెలుస్తుంది" అని దాటవేసాడు. దాంతో ఊళ్లో ఉత్కంఠ పరాకాష్టకు చేరింది.

గృహప్రవేశం రోజు రానే వచ్చింది. భవనం ముందు ఎర్రటి కార్పెట్ పరిచారు. ఊరంతా గుమిగూడింది. సుబ్బమ్మ తన భర్తతో కలిసి ముందు వరుసలో నిలబడి, యజమాని కోసం ఎదురుచూస్తోంది.

అప్పుడే మూడు నల్లటి ఖరీదైన బెంజ్ కార్లు వేగంగా వచ్చి ఆగాయి. సెక్యూరిటీ గార్డులు తలుపులు తీశారు. కారులోంచి దిగిన ఆ వ్యక్తిని చూసి ఊరి జనానికి నోట మాట రాలేదు! గాలి ఆడనంత పని అయింది!

పట్టు చీర కట్టుకుని, మెడలో డైమండ్ హారం, చేతులకు బంగారు గాజులతో... రాజసంతో కారు దిగింది రుక్మిణి!

సుబ్బమ్మ చేతిలో ఉన్న పూలమాల కిందపడిపోయింది. "రుక్మిణీ? ఈ అమంగళపు పీనుగ... ఈ భవనానికి యజమానురాలా?!" అని సర్పంచ్ నోరు వెళ్లబెట్టాడు.

రుక్మిణి హుందాగా నడుచుకుంటూ వచ్చి సుబ్బమ్మ ముందుకు నిలబడింది. "ఏంటి సుబ్బమ్మ గారూ... దరిద్రపు మొహం ఎదురొస్తే శకునం బాగోదన్నావ్ కదా, మరి ఇప్పుడు నా సొంత ప్యాలెస్ ప్రారంభోత్సవానికి వచ్చారేంటి?" అని ప్రశాంతంగా అడిగింది. ఊరంతా నిశ్శబ్దం ఆవరించింది.

తన భూముల్లో ఊరి పేదలకు ఉపాధి కల్పిస్తానని, అనాథ పిల్లలకు ఆశ్రయమిస్తానని రుక్మిణి ప్రకటించింది. నిన్నటి వరకు ఆమెను తక్కువ చేసి చూసిన అదే ఊరి పెద్దలు, సుబ్బమ్మ దంపతులు ఇప్పుడు రుక్మిణి కాళ్ల దగ్గర నిలబడి క్షమాపణలు కోరారు.

భవనం లోపల జరిగిన పూజా కార్యక్రమంలో, ఊరి ముత్తైదువులందరూ పోటీపడి రుక్మిణికి అగ్ర తాంబూలం అందించారు. పసుపు, కుంకుమలు ఇచ్చి ఆమె ఆశీర్వాదం తీసుకున్నారు.

డబ్బు, నైపుణ్యం, ఆత్మవిశ్వాసం ఉంటే సమాజం ఒకరిని చూసే కోణం ఎలా మారుతుందో రుక్మిణి తన గెలుపుతో నిరూపించింది. తనలాంటి విధివంచితలకు ఆసరా ఇవ్వాలని నిర్ణయించుకుంది. ఒంటరిగా వెళ్లి ఎడారిని జయించిన ఆ రుక్మిణి... ఇప్పుడు తన సొంత ఊరిలోనే మహారాణిలా వెలిగిపోతోంది.

(మరోకథ వచ్చేనెల)

Post your comments